## టీజీఎస్ సెట్ తేదీల్లో మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 1 : టీఎస్ సెట్–2024 వచ్చే నెల 10 నుంచి నిర్వహించనున్నట్టు టీఎస్ సెట్ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి తెలిపారు. హాల్‌టికెట్లను వచ్చే నెల 2నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. వివరాలకు www. telanganaset.org, www. osmania.ac.inను సంప్రదించాలన్నారు.

## 5 నుంచి 'స్వచ్ఛదనం'

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమానికి పూర్తి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణపై ఆమె గురువారం సచివాయలం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛదనం – పచ్చదనంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని, పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, సంపద వనాల నిర్వహణపై దృష్టిపెట్టాల సూచించారు.

## 4 మెడికల్ కాలేజీలకు అనుమతులు

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది 8 కాలేజీల కోసం దరఖాస్తు చేయగా ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీలకు ఎల్‌వోపీ జారీ అయ్యింది. యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మెదక్ కాలేజీల అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

## 3 హెచ్‌వోడీ పోస్టులు

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తేతెలంగాణ) : వైద్యారోగ్యశాఖలో మరో 3 హెచ్‌వోడీ పోస్టులు రానున్నాయి. ఇన్‌చార్జీలుగా ఉన్న డీపీహెచ్, డీఎంఈ, డీసీఏ, టీవీవీపీ కమిషనర్ పోస్టులను రెగ్యులర్ చేయనున్నట్టు తెలిసింది. డీపీహెచ్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ, టీవీవీపీ కమిషన్ పోస్టులను క్రియేట్ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

# సీఎం హామీలు నీటి మూటలేనా?

- బడులు, కాలేజీల్లో ఉచిత విద్యుత్తు హామీకి మంగళం!
- గతంలో హామీలిచ్చి విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి
- నేడు ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో సమావేశం




హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలోని అన్ని సర్కారు స్కూళ్లు, కాలేజీలకు ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తాం. ఈ అంశంపై మార్చి 12న జరిగే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వ స్కూళ్లకు సర్వీస్ పర్సన్లను నియమిస్తాం. కావాల్సిన నిధులను ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమచేస్తాం' ఇవి మార్చి 10న జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఉపాధ్యాయ సంఘాల నేతలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ. ఐదు మాసాలు గడిచినా ఈ హామీలను నెరవేర్చలేదు. రాష్ట్రంలో 26,826 సర్కారు బడుల్లో 20.75 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. గత కేసీఆర్ సర్కారు ప్రభుత్వ స్కూళ్లల్లో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను స్థానిక సంస్థలకు అప్పగించింది. సర్పంచుల కాలపరిమితి ముగియడం, కొత్త ప్రభుత్వం ఇప్పటివరకు సర్వీస్ పర్సన్లను నియమించక పోవడంతో బడుల్లో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. మధ్యాహ్న భోజనం, ఇతర వ్యర్థాలను తొలగించేవారు లేక ఈగలు, దోమలు ముసురుతున్నాయి. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆ రెండు హామీలను వెంటనే నెరవేర్చాలని ఉపాధ్యాయలోకం కోరుతున్నది.

### ప్రభుత్వాన్ని నిలదీసే యోచనలో టీచర్లు

రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఎల్బీ స్టేడియంలో సమావేశం కానున్నారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులతో సీఎం భేటీ కానుండగా ఈ సభకు 30 వేల మందికిపైగా హాజరుకానున్నారు. ఉపాధ్యాయులను తరలించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటుచేసింది. ఒక్కో బస్సుకు ఒక నోడల్ అధికారి, అసిస్టెంట్ నోడల్ అధికారి, పోలీసు కానిస్టేబుళ్లను ఇన్‌చార్జులుగా నియమించింది. ఒక్కో సంఘం నుంచి ఇద్దరు ప్రతినిధులను వేదిక మీదికి ఆహ్వానిస్తారని ఇప్పటికే సంఘాలకు సమాచారం ఇచ్చారు. సర్వీస్ పర్సన్లు, ఉచిత విద్యుత్తు సహా పెండింగ్‌లో ఉన్న హామీలను ఇదే సభలో ప్రస్తావించాలని వివిధ సంఘాల నేతలు యోచిస్తున్నాయి. అపరిష్కృత సమస్యలను, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఈ సభలో ప్రస్తావించాలని మరికొన్ని సంఘాల నేతలు భావిస్తున్నారు.

### ఉపాధ్యాయుల మరికొన్ని డిమాండ్లు

- ప్రాథమిక పాఠశాలలకు 10 వేల హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి. అవసరమైతే ఢిల్లీ తరహాలో రెండు పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి.
- అప్‌గ్రేడ్ కాని 900 పైచిలుకు పండిట్, పీఈటీ పోస్టులకు అప్‌గ్రేడ్ చేసి, మిగతా వారికి పదోన్నతులు కల్పించాలి.
- ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చేలా పీఆర్సీని, ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలి.
- పెండింగ్‌లోని నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలి.
- ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.

### టీచర్ల సభకు సవాలక్ష ఆంక్షలు

హైదరాబాద్‌లో సభకు వచ్చే ఆ ఉపాధ్యాయులకు వివిధ జిల్లాల డీఈవోలు సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారు. బస్సు ఎక్కాక, సభ ముగిసిన తర్వాతా సెల్ఫీ తీసుకోవాలని, సీఎల్ మంజూరు చేయబోమని, స్కూల్ రిజిస్టర్‌లో సంతకం పెట్టరాదని, సొంత వాహనాల్లో రావొద్దని ఆదేశించారు. ఇదే అంశంపై ఆరా తీసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని 'నమస్తే తెలంగాణ' ఆరా తీయగా తామెలాంటి నిబంధనలు విధించలేదని, ఒకరిద్దరు డీఈవోలు ఇలాంటి ఆదేశాలిచ్చినట్టుగా తమ దృష్టికి వచ్చిందని వివరణ ఇచ్చారు. బస్ ట్రాకింగ్ యాప్‌ను మాత్రమే వినియోగిస్తున్నామని, బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటే పోలీసులతో సమన్వయం చేసుకునేందుకు వినియోగిస్తున్నామని తెలిపారు.

## ఎక్స్‌ప్రెస్ రూట్లలో సెమీ డీలక్స్

**ఆర్టీసీలో త్వరలో 300 కొత్త బస్సులు**

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): త్వరలో 300 కొత్త బస్సు సర్వీసులను అందుబాటులోకి తేవాలని టీజీఎస్‌ఆర్టీసీ నిర్ణయించింది. మహిళల ఉచిత ప్రయాణం రద్దీ కారణంగా సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఈ బస్సులను రోడ్డెక్కించాలని సంకల్పించింది. ఈ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం లేదని అధికారులు చెప్పారు. సెమీడీలక్స్ సర్వీసులు రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల మధ్య నడపనుండగా, నగరంలో మెట్రో డీలక్స్‌ను తిప్పనున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సు కంటే వీటిల్లో టికెట్ ధర 5 నుంచి 6 శాతం ఎక్కువగా, డీలక్స్ కంటే 4 శాతం తక్కువగా ఉండనున్నది. ఎక్స్‌ప్రెస్ బస్సులతో పోలిస్తే సీట్లు ఎక్కువగా ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్ బస్సుల డిమాండ్ రూట్లలోనే వీటిని తిప్పాలని సంస్థ నిర్ణయించింది.

## గద్వాల ఎమ్మెల్యే బండ్ల కాంగ్రెస్‌ను వీడలేదు

**మంత్రి జూపల్లి కృష్ణారావు • మీడియా ముందు నోరుమెదపని ఎమ్మెల్యే బండ్ల**

గద్వాల, ఆగస్టు 1 : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడలేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రెండ్రోజుల కిందట అసెంబ్లీ కారిడార్‌లో బండ్లకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కనిపిస్తే పాత పరిచయం కొద్ది వారితో మాట్లాడినట్టు పేర్కొన్నారు. అందరం కాంగ్రెస్‌లోనే ఉన్నామని పేర్కొన్నారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి జూపల్లి అల్పాహారం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే కొనసాగుతారని స్పష్టం చేశారు. పార్టీలో ఎవరి గౌరవం వారికి ఉంటుందని అన్నారు. అనుమానాలు నివృత్తి చేసుకోవడానికి ఎమ్మెల్యేను కలిసినట్టు చెప్పారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి. చిత్రంలో ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాత్రం గద్వాల ఎమ్మెల్యే బండ్ల తమ పార్టీలోనే ఉన్నారని చెబుతుంటే పక్కనే ఉన్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాత్రం నోరు మెదపకపోవడం కొసమెరుపు. పార్టీలో ఉన్నారా? లేదా? అని మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యేను ప్రశ్నించగా.. మౌనం వహించారు.

## పెద్దవాగు ప్రాజెక్టుపై 5న జీఆర్‌ఎంబీ సమావేశం

హైదరాబాద్, ఆగస్టు1 (నమస్తే తెలంగాణ): అశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టు గండిపై తెలంగాణ, ఏపీతో చర్చించేందుకు గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు 5వ తేదీన సమావేశం నిర్వహించనుంది. వరద ఉధృతంగా వస్తున్నా సకాలంలో ప్రాజెక్టు గేట్లు తెరవకుండా నిర్లక్ష్యం వహించడం వల్లే గండి ఏర్పడిందని ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు నిర్ధారించారు. తెలంగాణ ఇరిగేషన్‌శాఖకు రూ.30కోట్ల నష్టం వాటిలినట్టు అంచనా వేశారు. 200 ఎకరాల మేర ఇసుక మేటలు ఏర్పడడంతోపాటు, 16గ్రామాలు ముంపునకుగురై, 90 ట్రాన్స్‌ఫార్మర్లు, 200 కరెంటు స్తంభాలు ధ్వంసమైనట్లు గుర్తించారు. గోదావరి బేసిన్‌లో ఏకైక ఉమ్మడి ప్రాజెక్టు ఇదే. అలాగే 6వ తేదీన సమీకృత సీతారామ ప్రాజెక్టు అనుమతుల అంశంపై చర్చించనుంది.

## బ్యాంకుల్లో 5291 పోస్టులు

**ప్రొబేషనరీ ఆఫీసర్ - 4455 ఖాళీలు, • స్పెషలిస్ట్ ఆఫీసర్- 896 పోస్టులు**

(ఎడ్యుకేషన్ డెస్క్, హైదరాబాద్): ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 4455 ఖాళీలను భర్తీ చేయనున్నారు. బీవోబీ, బీవోఐ, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఐవోబీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు. 20–30 ఏండ్ల మధ్య వయస్సు ఉండాలి. ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వైద్య పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఆగస్టు 21లోగా దరఖాస్తు చేసుకోవాలి. వీటితోపాటు ప్రభుత్వ బ్యాంకుల్లో 896 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన కూడా విడుదలైంది. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్: https://ibps.in చూడవచ్చు.

## 23 నుంచి డీఈఐఈడీ ఫైనల్ టీపీ

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్‌ఈ) రెండో సంవత్సరం ఫైనల్ లెస్సన్ టీచింగ్ ప్రాక్టికల్స్‌ను ఈ నెల 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు నిర్వహించనున్నట్టు పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని రెండు విడుతల్లో నిర్వహించాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు.

## మాడల్ స్కూల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి : పీఎంటీఏ

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మాడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రోగ్రెస్సివ్ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(పీఎంటీఏ)ప్రభుత్వాన్ని కోరింది. 11ఏండ్లుగా బదిలీలు, పదోన్నతులు నోచుకోకపోవడంతో టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని, కోర్టు కేసులు పరిష్కరించి బదిలీలు, పదోన్నతులు పూర్తిచేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ప్రభుత్వాన్ని కోరారు.

## అన్ని క్యాడర్లలో పదోన్నతులు కల్పించాలి

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ప్రభుత్వ యాజమాన్యంలోని టీచర్లకు అన్ని క్యాడర్లలో పదోన్నతులు కల్పించాలని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. డైట్ లెక్చరర్, ఎంఈవో, డిప్యూటీ ఈవో, బీఈడీ, డిగ్రీ, జేఎల్ పదోన్నతులను కేవలం ప్రభుత్వ యాజమాన్యంలోని టీచర్లకే కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం వీరాచారి, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మీకాంత్‌రెడ్డి లేఖ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. జిల్లా పరిషత్ టీచర్లను జిల్లా పరిషత్ సీఈవోల పరిధిలోకి పంపించాలని డిమాండ్ చేశారు.

## సీడీపీవో పోస్టుల భర్తీకి నార్మలైజేషన్ అమలు

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): సీడీపీవో, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నార్మలైజేషన్ విధానాన్ని అమలు చేయనున్నట్టు టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. వీటి భర్తీకి కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విడతల వారీగా నిర్వహించనున్న పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని నార్మలైజేషన్ విధానాన్ని అమలు చేయనున్నట్టు వెల్లడించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు.

